క్లుప్తంగా

లాకులకు కొత్త షట్టర్ల ఏర్పాటు



గుత్తెనదీవిలో నార్త్ అద్దాల్ కాలువకు షట్టర్ల ఏర్పాటు పనులు

ఐ.పోలవరం: గుత్తెనదీవి గ్రామంలో నార్త్ అద్దాల్ కాలువపై ఉన్న ఎస్‌ఏసీ లాకులు పూర్తిగా తుప్పు పట్టిపోవడంతో నీరు పంట పొలాల్లోకి వచ్చేవి. కొత్త షట్టర్ల ఏర్పాటుకు ఇటీవల కలెక్టర్ హిమాన్షు శుక్లా రూ.16 లక్షల నిధులు విడుదల చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. ఈ పనులను ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు పరిశీలించారు. వరదల సమయంలో వరద నీరు గ్రామంలోకి రాకుండా, గోదావరి పోటు సమయంలో ఉప్పునీరు ఈ కాలువ నుంచి చేలల్లోకి ప్రవేశించకుండా ఈ షట్టర్లు రక్షణ కల్పిస్తాయని అధికారులు తెలిపారు. దీని ద్వారా గుత్తెనదీవి, జి.మూలపాలెం, ఎదుర్లంక గ్రామాల్లో వరి చేలకు ఇబ్బంది తప్పింది.

మసీదుల అభివృద్ధికి కృషి



కొత్తలంక బాబా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఖాదర్ తదితరులు

ముమ్మిడివరం: కొత్తలంక హజరత్ సయ్యద్ అహమ్మద్ అలీషా ఖాద్రీ వలీబాబా దర్గాను కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్, వక్ఫ్ బోర్డు సభ్యులు శుక్రవారం సందర్శించారు. దర్గాలో జియారత్ చేసుకుని బాబా ఆశీస్సులు పొందారు. తొలిత సభ్యులకు దర్గా ముజావర్ గేదెల రఘునాథ్‌బాబా, శివ, తాజుద్దీన్ ఘన స్వాగతం పలికారు. దర్గా వద్ద మసీదు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. చైర్మన్ ఖాదర్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో దాతల సహకారంతో త్వరలో మసీదు నిర్మాణం చేపడతామన్నారు. జిల్లాలో మసీదులు, దర్గాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం సమక్షంలో దర్గాలో హుండీలను లెక్కించగా రూ.94,500 ఆదాయం వచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డు సభ్యులు రబ్బాని, ఎండీవై షరీఫ్, సెక్రటరీ జాఫర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజాబాబు పాల్గొన్నారు.


బాధితులకు నిత్యావసరాల పంపిణీ

అల్లవరం: సామంతకుర్రు అంబేడ్కర్ నగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన నక్కా ధనలక్ష్మి కుటుంబానికి గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్తాబత్తుల శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు పరమట రాజేష్, కుంచే అర్జునరావు, పోతుమూడి రాజేష్, అభి, తోకల రాజ్‌కుమార్, కుంచే అర్జున్ పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

తాళ్లరేవు: పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28న వేలం పాట నిర్వహించనున్నట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవాని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని ఏఆర్ పెరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు వేలం ఉంటుందన్నారు. 26 మోటార్ సైకిళ్లు, నాలుగు ఆటోలు, నాలుగు బోట్లకు ఈ వేలం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 99636 91117 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత



మృతుడి కుటుంబానికి చెక్కును అందిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడిలోని ముంగండవారిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉపాధ్యాయుడు జె.సుబ్రహ్మణ్యం ఇటీవల మృతిచెందగా, అతని కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా రూ.మూడు లక్షలు అందించారు. స్థానిక ఎంఆర్‌సీలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ చెక్కును జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్.విశ్వనాథం అందజేశారు. రాష్ట్ర కౌన్సిలర్ మేరీ రూత్, కుటుంబ సంక్షేమ పథకం కోశాధికారి ఒ.సురేష్, జీవీ రమణ పాల్గొన్నారు.

రెండు కళాశాలలపై ఫిర్యాదు

అమలాపురం టౌన్: అమలాపురంలోని నారాయణ కళాశాల, కిమ్స్ నర్సింగ్ కళాశాలల తీరుపై స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో సీహెచ్ సత్తిబాబుకు ఏబీవీపీ ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నారాయణ కళాశాలలో ప్రాక్టికల్స్ పేరుతో అక్రమ వసూళ్లు, కిమ్స్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు రెండు గంటలే బోధించి మిగతా సమయమంతా ఆస్పత్రిలో నర్సులుగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ఆ రెండు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ప్రతినిధులు డీఆర్వోకు విజ్ఞప్తి చేశారు.

స్వామీ.. ఇటు చూడవేమీ!

- మీసాల వెంకన్న ఆలయ నిర్మాణం ఎప్పటికో?
- పురాతన ఆలయం కూల్చివేసి నాలుగేళ్లు పూర్తి
- మూడుసార్లు భూమిపూజ చేసినా కదలని పనులు



యానాంలో మీసాల వెంకన్న నూతన ఆలయ నిర్మాణ స్థలం

యానాం: మీసాల వెంకన్నకూ నిలువు నీడ కరవైంది.. నాడు వైభవాన్ని చాటిన ఆ స్వామికీ కష్టమొచ్చింది.. సుమారు ఆరొందల ఏళ్ల కిందట రెడ్డిరాజులు నిర్మించిన యానాంలోని శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం కూల్చివేసి సుమారు నాలుగేళ్లు పూర్తి కావొస్తుంది. దాని స్థానంలో నూతన ఆలయం పనులు ఒక అంగుళం కూడా కదలకుంది. దీనిపై భక్తుల్లో ఆందోళన నెలకొంది. 15వ శతాబ్దంలో రెడ్డి రాజులు నిర్మించిన ఈ ఆలయం చారిత్రక వైభవం చాటింది. అంతేకాకుండా తిరుపతి వేంకటేశ్వరుని ఆలయం కంటే ముందుగానే ఇక్కడ మీసాల వెంకన్నను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఈ ఆలయానికి కల్యాణపురంగా పేరుంది.

వర్షపునీరు వస్తుందని..

వర్షాలు ఎక్కువగా కురిసేటప్పుడు డ్రైనేజీలు పొంగి, ఆ నీరు కాస్తా స్వామివారి ఆలయంలోకి వస్తుందనే కారణంతో ఆలయాన్ని కూల్చివేశారు. దానిస్థానంలో నూతన ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 2019 ఫిబ్రవరి 21న పురాతన ఆలయాన్ని కూల్చివేశారు. వారసత్వ సంపదైన ఆలయ కూల్చివేత పనులను నిలుపుదల చేయాలని పలువురు అప్పట్లో పలువురు కోర్టుకు వెళ్లారు. అయినప్పటికీ వాటిని ఖాతరు చేయకుండా మూలవిరాట్‌ను సైతం తొలగించి బాలాలయంలో ప్రతిష్ఠించారు.

నిధులు వెనక్కి వెళ్లడంతో..

నూతన ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.5.45 కోట్లు, పుదుచ్చేరి దేవదాయశాఖ, హెచ్ఆర్ఏల నుంచి రూ.80 లక్షలు, భక్తుల విరాళాలతో కలసి మొత్తం రూ.10 కోట్లతో నిర్మించాలని నిర్ణయించారు. వివిధ కారణాలతో ఆ నిధులు కాస్తా వెనుకకు వెళ్లిపోయాయి. మళ్లీ టీటీడీ నిధుల ద్వారా దేవాలయాన్ని చేపడతామని చెబుతున్నారు.

నాలుగేళ్లు పూర్తయినా..

పాత ఆలయాన్ని కూల్చివేసి సుమారు నాలుగేళ్లు పూర్తి కావొస్తుంది. ఇంకా నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి మూడు సార్లు భూమి పూజ చేశారు. నిర్మాణానికి భారీ గోతులను తవ్వారు. అనంతరం కాంక్రీట్ వేసి వదిలేశారు. ఒక ఇటుకను కూడా పెట్టలేదు. వర్షం వస్తే గోతుల్లో భారీగా నీరు చేరుతుంది. ఈ నేపథ్యంలో ఆడిట్ లేకపోవడం, 18 ఏళ్లుగా ఒకే పాలకవర్గం ఉండటం తదితర కారణాలతో దేవస్థానం కమిటీని ఇటీవల మద్రాసు హైకోర్టు తాత్కాలికంగా రద్దు చేసింది. ఆలయానికి పక్కనే బాలాలయాన్ని నిర్మించి స్వామి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారు. అక్కడే భక్తులు నిలబడి స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు.



మీసాల వెంకన్న పురాతన ఆలయం కూల్చివేత పనులు (ఫైల్)

వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం..



కూల్చివేసిన పురాతన దేవాలయం స్థానంలో అంతా ఐక్యతతో నూతన ఆలయానికి సహకరించాలి. బాలాలయానికి భక్తులు రాని పరిస్థితి ఉంది. అర్చకులు ఉపాధి కోల్పోతున్నారు. ఆలయ నిర్మాణానికి భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

– పెద్దింటి లక్ష్మణాచార్యులు, ఆలయ అర్చకుడు

వారసత్వ సంపద ఇది..



శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాన్ని భక్తుల మనోభావాలకు విరుద్ధంగా కూల్చివేశారు. మళ్లీ నూతన ఆలయ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. యానాం పట్టణానికి వారసత్వ సంపదగా మీసాల వేంకటేశ్వర స్వామి గుడి ఉంది. దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

ఆధ్యాత్మిక చింతనతో శాంతి



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: ఆధ్యాత్మిక చింతనతో గ్రామాల్లో శాంతి, సౌభ్రాతృత్వం పరిఢవిల్లుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని లంకాఫ్ ఠానేల్లంకలో శుక్రవారం శ్రీకోదండ రామాలయం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, రెడ్డి శివన్నారాయణ, వేటుకూరి బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌తో విద్యార్థుల్లో నైపుణ్యం

యానాం: ఐటీఐ పారిశ్రామిక శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి అప్రెంటిస్ చేయడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ అప్రెంటిస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను పుదుచ్చేరి కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ పూర్తయిన తర్వాత అప్రెంటిస్ చేయాలన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈలప్రోలు విష్ణువర్ధనరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణసుధాకర్, ఇన్‌స్ట్రక్టర్స్ ఆనంద్, నారాయణరావు, లంక ప్రసాదరావు పాల్గొన్నారు.

పచ్చ రాతలపై జనాగ్రహం



'ఈనాడు' ప్రతులను దహనం చేస్తూ రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

ముమ్మిడివరం: దుష్ప్రచారాలను ప్రచురిస్తూ, సత్యాలను మరుగున పరుస్తూ ప్రజాస్వామ్యానికి, పత్రికా రంగానికి 'ఈనాడు' మీడియా వ్యవస్థ గొడ్డలి పెట్టులా మారిందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ముమ్మిడివరంలోని 216 నంబరు జాతీయ రహదారిపై వైఎస్సార్ సీపీ శ్రేణులు 'ఈనాడు' పత్రికా ప్రతులను దహనం చేశారు. రామోజీరావు డౌన్ డౌన్ అంటూ పచ్చ రాతలపై పార్టీ శ్రేణులు విరుచుకుపడ్డారు. అడ్డదారులు తొక్కే రామోజీరావు కుతంత్రాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని నాయకులు విమర్శించారు. టీడీపీ నాయకుడు పట్టాభికి సంబంధించిన పాత ఫొటోలతో తప్పుడు వార్తలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న 'ఈనాడు' దినపత్రిక యజమాని రామోజీరావు హేయమైన చర్యలకు పాల్పడటం పత్రికా రంగానికి సిగ్గు చేటన్నారు. తప్పుడు వార్తలు రాసి అడ్డంగా దొరికిపోయి సవరణలు వేసుకోవాల్సిన దుస్థితి ఆయనకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కోలా బాబ్జి, బొంతు సత్యశ్రీనివాస్, రెడ్డి శివన్నారాయణ, కాశి రామకృష్ణ, కోన శ్రీనివాసరావు, చెల్లి భాగ్యలక్ష్మి, వరసాల రమాదేవి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు ఆమోదం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా హోమ్‌గార్డులు, పోలీసులకు యూనిఫామ్స్ ఇచ్చేందుకు నిధులు మంజూరు ఫైలుకు శుక్రవారం ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం తెలిపారు. హోమ్‌గార్డుల యూనిఫామ్స్ కోసం ఏడాదికి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పుదుచ్చేరి 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.11,600 కోట్లతో బడ్జెట్‌ను నిర్ణయిస్తూ ప్లానింగ్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఇందులో రూ.1,700 కోట్ల రుణంగా ఉందని తెలిపింది. జీఎస్టీ ఆదాయం, రుణం నిష్పత్తి గత ఏడాది 24:28 ఉంటే ప్రస్తుతం 24:84కు పెరిగింది. ఈ మేరకు వచ్చే నెల 9న జరిగే బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ



క్విజ్ పోటీల విజేతలను అభినందిస్తున్న అధికారులు, దివ్యాంగ పాఠశాల సిబ్బంది

యానాం: బెంగళూరుకు చెందిన సేవా ఇన్ యాక్షన్ సంస్థ, కాకినాడ ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ వారు రాష్ట్రస్థాయిలో దివ్యాంగ విద్యార్థులకు కాకినాడలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో యానాం ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని శుక్రవారం సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెయ్యా శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు సంగాడి యేసురాజు, సెన్నాంశెట్టి సాయివిరాట్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. విజేతలను జేజేబీ మాజీ సభ్యులు ఉషారాణి, స్వరాజ్యలక్ష్మి, భ్రమరాంబిక, పోలీసుశాఖ సిబ్బంది లత, పద్మ, జానకిరామ్, పవన్, ప్రభాకర్, ఐసీడీఎస్ సిబ్బంది సత్కరించారు. పాఠశాల నిర్వాహకులు ఎస్పీ రెడ్డి సేవలను కొనియాడారు. చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు.

ఎంపీ అనురాధను కలసిన విద్యాసాగర్

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్‌గా నియమితులైన కుడుపూడి విద్యాసాగర్ మొగళ్లమూరులోని ఎంపీ నివాసంలో శుక్రవారం ఎంపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కుడుపూడి శాంతావతి, గుమ్మడి ప్రసాద్, బొంతు శ్రీనివాస్, మట్టపర్తి శ్రీనివాస్, రెడ్డి గనిరాజు, ఆకుల శ్రీనివాస్, మద్దింశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న ఎంపీ అనురాధ

మమ్మేలు మహాలక్ష్మి

- వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

తాళ్లరేవు: జార్జిపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు నేతృత్వంలో దంపతులచే పూజలు నిర్వహించారు. ఉదయం 7.51 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశస్థాపన చేశారు. భక్తులు హోమ గుండానికి పూజలు, ప్రదక్షిణలు చేసి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆవుకు తొలి దర్శన భాగ్యం కల్పించిన అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను పంపారు. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులు గ్రామంలో కోలాటాలు, మేళతాళాలతో భారీ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి చీర, సారెను సమర్పించారు. ఆలయ శిఖరం పైనుంచి బూరెలను వేయడంతో వాటిని తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

రేపు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు



చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం ఏర్పాట్లపై చర్చిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం స్థానిక హైస్కూల్ రోడ్డులోని యెండూరి కన్వెన్షన్ హాలులో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఉంటాయి. ఈ సమావేశానికి కామర్స్ పరిధిలోని వ్యాపార సంఘాల ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆ చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సర్క్యులర్ బజార్ వద్ద సమావేశం జరిగింది. చాంబర్ నూతన కార్యవర్గ ఎన్నికతో పాటు పట్టణంలో అనాదిగా ఉంటున్న మంగళవారం మార్కెట్ శెలవు దినాన్ని ఆదివారానికి మార్చే నిర్ణయాన్ని సమావేశం ఆమోదించనుంది. సమవేశం రోజు సాయంత్రం పట్టణంలోని తమ దుకాణాన్నీ మూసివేసి నిర్దేశించిన సమయానికి ప్రతి వ్యాపారి విధిగా హాజరయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని తాతాజీ సూచించారు. చాంబర్ ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, జనిపిరెడ్డి సురేష్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ



చోరీ చేస్తున్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయిన చిత్రం

ఐ.పోలవరం: పట్టపగలే ఓ మందుల షాపులో నగదు దొంగతనం చేసిన సంఘటన మురమళ్లలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మురమళ్ల మార్కెట్ సెంటర్‌లో వెంకటరమణ మెడికల్ స్టోర్స్‌లో ఉదయం యజమాని మందుల కోసం వెనుక గదిలోకి వెళ్లాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి కౌంటర్ లాగి నగదు అపహరించాడు. సుమారు రూ.18 వేల చోరీ జరిగి ఉంటుందని పోలీసులకు యజమాని ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక ప్రశాంతతతో సంపూర్ణ జీవితం

అమలాపురం టౌన్: అమలాపురం రవణం వీధి గరిగుంట చెరువు వద్ద ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో రూ. 3 కోట్లతో నిర్మించిన మెడిటేషన్ రిట్రీట్ సెంటర్ భవనంలో శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. బ్రహ్మకుమారీస్ ఇంటర్నేషనల్ హెడ్ క్వార్టర్స్ రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబూ నుంచి ముఖ్య అతిథిగా హాజరైన ఆ సంస్థ రూరల్ వింగ్ నేషనల్ కోఆర్డినేటర్ బీకే రాజుభాయ్ ఈ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన బ్రహ్మకుమారీస్ సభలో రాజుభాయ్ మాట్లాడుతూ మనిషికి మానసిక ప్రశాంతతోనే సంపూర్ణ జీవితం సాకారమవుతుందన్నారు. ఈ రిట్రీట్ సెంటర్ ద్వారా ఇక నుంచి కోనసీమ జిల్లా ప్రజలకు మానసిక ప్రశాంతత చేకూర్చే విధంగా ఆధ్యాత్మిక, ధ్యాన సేవలు అందుబాటులో వస్తాయన్నారు. సికింద్రాబాద్ జోనల్ ఇన్‌చార్జి బీకే సరోజ, విజయనగరం జోనల్ ఇన్‌చార్జి బీకే అన్నపూర్ణ, విశాఖ రీజినల్ ప్రతినిధులు బీకే శివలీల, బీకే సత్యవతి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి బీకే రజని, కోనసీమ ఇన్‌చార్జి బీకే శ్రీదేవి, కాకినాడ ఇన్‌చార్జి బీకే మీరా తదితరులు పాల్గొని ప్రసంగించారు. కోనసీమ ఇన్‌చార్జి బీకే శ్రీదేవి శిరస్సుపై శుభ కలశం ఉంచడం ద్వారా ముఖ్య అతిథి రాజుభాయ్ నూతన భవనాన్ని ప్రారంభించారు.



బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ రిట్రీట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాజుభాయ్ తదితరులు

సీపీఎం నిరసన




అమలాపురంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అమలాపురం టౌన్: అదానీ అవినీతికి నిరసనగా సీపీఎం నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కూడా వారు నినాదాలు చేశారు. నాయకులు పి.వసంతకుమార్, దుర్గాప్రసాద్, పాము బాలయ్య, సికిలే సూర్యనారాయణ, వాకపల్లి హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని తదితర డిమాండ్లతో సీపీఎం నాయకులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు కేఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రాకు అన్యాయం జరిగిందన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పోతురాజుకు అందజేశారు. సీపీఎం పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, మానుపాటి నాగేశ్వరరావు, లక్ష్మణరావు, అదృష్టదీపుడు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



బండారులంక ఉన్నత పాఠశాలలో సామూహిక సరస్వతి పూజలు చేస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: బండారులంక ఉన్నత పాఠశాలలో శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సరస్వతీ ప్రతిమలు, పెన్నులు ఉంచి పూజ చేశారు. 97–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులచే లడ్డూ ప్రసాదం అందజేశారు. ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకీలక్ష్మి, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ పెదపూడి బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లిబ్బులు, వైఎస్సార్ సీపీ నాయకులు సరేళ్ల రామకృష్ణ, కాలేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారంపై చర్చ



ఓఎన్జీసీ పరిహారంపై చర్చిస్తున్న మల్లాడి, ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ఓఎన్జీసీ గ్యాస్ పైపులైన్ నిర్మాణం ద్వారా వేట నష్టపోతున్న యానాం మత్స్యకారులకు సంబంధిత సంస్థ అందించే నష్ట పరిహారంపై శుక్రవారం చర్చ జరిగింది. స్థానిక ఆర్ఏఓ ఛాంబర్‌లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆర్ఏఓ మునిస్వామితో చర్చించారు. లబ్ధిదారులతో పరిహారం పంపిణీ తదితర వాటి గురించి మాట్లాడారు. మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలపై తర్ఫీదు

అంబాజీపేట: గ్రామంలోని కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో విష్ణు సహస్రనామ, భగవద్గీత శ్లోకాలపై తర్ఫీదు ఇవ్వనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి నరసింహాచార్యులు తెలిపారు. రాబోయే ఉగాది నుంచి ప్రతి ఆదివారం ఉయదం తొమ్మిది నుంచి పది గంటల వరకు విష్ణు సహస్రనామం, భగవద్గీత శ్లోకాలను చదివించడంతో పాటు వాటిలో ఉన్న అర్థం, పరమార్థాలను వివరిస్తామని ఆయన తెలిపారు.

సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ముమ్మిడివరం: మండలంలో రబీకి సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతున్నామని అమలాపురం ఆర్డీఓ వసంతరాయుడు తెలిపారు. శుక్రవారం బొండాయికోడు, మల్లాయిపాలెంలో వృద్ధ గౌతమీ మురుగు నీటి కాలువపై నిర్మిస్తున్న క్రాస్ బండ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వివిధ మురుగునీటి కాలువల నీరు వృథా కాకుండా క్రాస్‌బండ్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నీటిని పంపింగ్ ద్వారా కాలువలకు మళ్లించి పంట పొలాలకు అందిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ యడ్ల రాంబాబు, డ్రైన్స్ జేఈ దుర్గానాయుడు, వీఆర్వోలు ఉన్నారు.



క్రాస్ బండ్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు

అమలాపురం రూరల్: అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన మూడు వేర్వేరు కేసుల్లో ముగ్గురికి స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ జైలు శిక్షలు విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. వీటికి సంబంధించి తాలూకా ఎస్సై ఎ.పరదేశి తెలిపిన కథనం ప్రకారం.. కోర్టులో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మలికిపురం మండలం మోరికి చెందిన దేశినీడి శ్రీనివాసరావు బండారులంకకు చెందిన లక్కింశెట్టి గురురాఘవేంద్రతో పాటు 11 మంది నుంచి రూ.8,47,500 తీసుకుని మోసం చేశాడన్నది అభియోగం. 2014లో జరిగిన ఈ మోసంపై అప్పటి తాలూకా ఎస్సై కె.సుధాకర్ కేసు నమోదు చేశారు. కోర్టులో ఈ కేసుకు సంబంధించి శుక్రవారం జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాసరావుకు ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారు.

చోరీ కేసుల్లో..

గత ఏడాది ఆగస్టు 1న జనుపల్లిలో గూడూరు సురేష్ ఇంటి వద్ద ఉన్న బైక్‌ను కొత్తపేట మండలం మందపల్లికి చెందిన ఏసుకోన రామకృష్ణ దొంగిలించాడు. ఈ నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. సవర్ప్పాలెంలో గత ఏడాది జూలై 23న కె.రమణకు చెందిన బైక్‌ను చల్లపల్లికి చెందిన మద్దెల చంటిబాబు చోరీ చేశాడు. నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష పడింది.